క్లుప్తంగా

నేడు ఉద్యమకారుల ఆకాంక్షల సదస్సు

హన్మకొండ: తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల సదస్సును ఈనెల 18న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ గోదుమల కుమారస్వామి తెలిపారు. సదస్సులో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్ పాల్గొంటారని ఒక ప్రకటనలో వివరించారు. ఆదివారం జరగనున్న సదస్సులో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని బాలానగర వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం కాళీయ మర్దన వాహనసేవ నిర్వహించారు. గోదా అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని నగర వీధుల్లో మేళతాళాలు, కోలాటాల మధ్య నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈఓ ఏలపాటి రత్నాకర్ రెడ్డి, చైర్మన్ శ్రీనివాసాచారి, సేవా సమితి సభ్యులు, వేణుగోపాల స్వామి ఆలయ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థపై చర్య తీసుకోవాలి



విద్యారణ్యపురి: ఎలాంటి అనుమతి లేకుండానే ముందస్తుగా అడ్మిషన్లు చేపట్టిన ఓ ప్రైవేట్ విద్యాసంస్థ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని భారత ఐక్యవిద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్, సభ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ శైలజకు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాకేష్, సాయి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

భవానీనగర్‌లో అగ్ని ప్రమాదం


హన్మకొండ: హనుమకొండ భవానీనగర్‌లో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. సాదుల సాయికృష్ణ ఇంటిలో వంట గ్యాస్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దాంతో అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి సహాయక చర్యలు చేపట్టి మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి నాగరాజు తెలిపారు. స్టౌ నేలపై పెట్టి, నాసిరకం రెగ్యులేటర్ వాడడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు చెప్పారు. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. సిలిండర్ కంటే ఎత్తులో స్టౌ ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

కరీమాబాద్ పాఠశాలను సందర్శించిన ఆర్జేడీ



కరీమాబాద్: కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి శనివారం సందర్శించారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు శనివారం నిర్వహించిన నేపథ్యంలో కరీమాబాద్ పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కె.సుభాష్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



వరంగల్: సమాజంలో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. వరంగల్ దేశాయిపేట రోడ్డులోని ఒయాసిస్ పబ్లిక్ స్కూల్‌లో జన్ను పరంజ్యోతి ఫౌండేషన్, మన అమెరికా తెలుగు సంఘం (మాటా) సంయుక్త నిర్వహణలో ఉచిత వైద్య క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఫౌండేషన్ చైర్మన్ జన్ను పరంజ్యోతి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడి మాతృభూమి ప్రజల కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాటా వ్యవస్థాపక సలహాదారుడు ప్రదీప్ సామల, అధ్యక్షుడు గానగోని శ్రీనివాస్, మాటా ఇండియా కోఆర్డినేటర్ విజయభాస్కర్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో 'ఇంటర్' కీలకం



సరస్వతి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాధవరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ సునీత



విద్యారణ్యపురి: నృత్యం చేస్తున్న విద్యార్థిని

ఖిలా వరంగల్: విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య చాల ముఖ్యమైనదని, విద్యపై ఏకాగ్రత సాధిస్తేనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని వరంగల్ జిల్లా ఇంటర్ విద్యాధికారి మాధవరావు సూచించారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శోభాదేవి అధ్యక్షతన జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ స్థాయిలో కొంతమంది విద్యార్థులు చెడు స్నేహాల వల్ల జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో ఏకాగ్రత చాలా అవసరం అని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు రజిత, రూపారాణి, వీరాంజనేయ కుమార్, మల్లారెడ్డి, సుధాకర్, అనిల్, నరేష్, హాలు నాయక్, లక్ష్మి, మమత, అనిత పాల్గొన్నారు.

హసన్‌పర్తి జూనియర్ కళాశాలకు గుర్తింపు

హన్మకొండ: హసన్‌పర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంచి గుర్తింపు ఉందని, 15ఏళ్లుగా రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధిస్తూ ఫలితాల్లో అగ్ర స్థానంలో నిలుస్తోందని ఇంటర్మీడియేట్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.గోపాల్ అన్నారు. హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఇక పూర్తిసమయం చదువుకోవడానికే కేటాయించాలని సూచించారు. విషయ పరిజ్ఞానంతో పాటు మెళకువలు నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సునీత, కళాశాల అభివృద్ధి కమిటీ కోశాధికారి చకిలం రాజేశ్వర్ రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు బీఎస్.రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

విద్యారణ్యపురి: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని హనుమకొండ జిల్లా డీఐఈఓ గోపాల్ అన్నారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్) వార్షికోత్సవం శనివారం జరగగా, ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థి దశలో ఇంటర్ విద్య చాలా కీలకమని అన్నారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా వార్షిక పరీక్షలు రాయాలని సూచించారు. వరంగల్ జిల్లా డీఐఈఓ మాధవరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు మాధవి, బాబురావు, శంకర్ నారాయణ పాల్గొన్నారు.

చేపల పెంపకంతో అధిక లాభాలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న రాజన్న, నరేష్‌నాయుడు

కరీమాబాద్: తెల్లరకం చేపల పెంపకం ఎంతో లాభదాయకమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న, జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్‌కుమార్ నాయుడు అన్నారు. మామునూరు కేవీకేలో జాతీయ మత్స్య మండలి ఆధ్వర్యంలో తెల్ల చేపల పెంపకంలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగియగా శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మత్స్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేపల పెంపకంలో నీరు, మేత సక్రమంగా అందించినట్లయితే మంచి ఫలితాలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో జనగామ జిల్లా మత్స్య శాఖ అధికారి బి.నాగులు, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ గణేష్, డాక్టర్ రాజు, డాక్టర్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

రామన్నపేట: రేగొండ మండలం పొనగల్లు గ్రామానికి చెందిన లచ్చమ్మ.. దారి తప్పి నగరానికి చేరుకోగా ఆమెను చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు కృషి చేసిన మట్టెవాడ కానిస్టేబుల్ దేవేందర్‌ను పోలీసు అధికారులు అభినందించారు. సీఐ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం పొరుగొండ్ల గ్రామానికి చెందిన లచ్చమ్మ తప్పిపోయి నగరానికి చేరుకుంది. సమాచారం అందుకున్న మట్టెవాడ బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ విజేందర్.. ఆమెను చేరదీసి భోజనం అందించి శుక్రవారం రాత్రి సఖి కేంద్రంలో ఆశ్రయం కల్పించారు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులను పిలిపించి ఆమెను వారికి అప్పగించారు. దాంతో కానిస్టేబుల్‌ను ఏసీపీ కార్యాలయంలో మట్టెవాడ ఏసీపీ కిషన్, సీఐ తుమ్మ గోపి, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య అభినందించారు.

కులగణనతో సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న శేషు

హన్మకొండ: కుల ఆధారిత జనగణనతో సామాజిక న్యాయం జరుగుతుందని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు ఆశాభావం వ్యక్తం చేశారు. కుల ఆధారిత జనగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. హనుమకొండ సుబేదారిలో బీసీ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా కులగణన చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో వెనుకబడిన వర్గాల ప్రయోజనాలకు విఘాతం కలిగిందని వాపోయారు. కులగణన చేయాలనే తీర్మానానికి మద్దతు పలికిన పార్టీలు, శాసన సభ్యులకు శేషు కృతజ్ఞతలు తెలిపారు. రమేష్, వినయ్ పాల్గొన్నారు.



కాజీపేట: మాట్లాడుతున్న సమ్మయ్య

కులగణన సాహసోపేతమైన నిర్ణయం

కాజీపేట: రాష్ట్రంలో కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించడం సాహసోపేతమైన నిర్ణయమని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య అన్నారు. కాజీపేట పట్టణంలో వడ్డెర సంఘం సభ్యులతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన పూర్తయితే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రకారం న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొంత అయిలయ్య, పల్లపు రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లపు రవీందర్, గుంజ కుమార్, పల్లపు శ్రీనివాస్, నవీన్‌కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీడీయూ స్నాతకోత్సవం



బంగారు పతకాలు పొందిన విద్యార్థులతో అతిథులు

నయీంనగర్: హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ మాజీ సెక్రెటరీ, జీటీఐ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు విజయాన్ని సాధించడానికి నిరంతరం అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. బలమైన పునాది, విశ్లేషణాత్మక పరాక్రమం, వినూత్న ఆలోచనలు, సానుభూతి లక్షణాలను మిళితం చేసుకొని నాయకులుగా ఎదగాలన్నారు. 15 దేశాల నుంచి 122మంది విద్యార్థులు, దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 415మంది విద్యార్థులు సీడీయూలో విద్యనభ్యసిస్తున్నారని వివరించారు. ఏడుగురు పీజీ విద్యార్థులు, ఆరుగురు డిగ్రీ విద్యార్థులు బంగారు పతకాలను సాధించగా, మొత్తం 756 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలను పొందారని చెప్పారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి, డాక్టర్ ఏ.కళ్యాణ్ చక్రవర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, సీడీయూ కులపతి సీహెచ్‌వీ.పురుషోత్తంరెడ్డి, ఉప కులపతి జి.దామోదర్, వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌రెడ్డి, సీఏఓ డాక్టర్ సాత్విక, టీసీడీ వీర వెంకటయ్య, రిజిస్ట్రార్ ఎం.రవీందర్, డీన్లు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ భూనిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్

నయీంనగర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల మండలం, వెల్లంపల్లి గ్రామ శివారులో టీఎస్ఎన్‌పీడీసీఎల్ 33/11 సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి ఇచ్చిన రైతులకు ఆపరేటర్ ఉద్యోగాలు ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్.రాకేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 2014 - 17 కాలవ్యవధిలో తమ సాగుభూమిని తీసుకొని సబ్‌స్టేషన్ నిర్మాణాలు చేపట్టిందని చెప్పారు. అప్పటి స్థానిక ఎమ్మెల్యేలు తమకు ఆపరేటర్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారని వాపోయారు. సమావేశంలో వీరన్న, దామోదర్, వినోద్‌కుమార్, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' నమోదు వేగవంతం



పేర్లు నమోదు చేస్తున్న విద్యుత్ అధికారులు

వరంగల్: కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అమలు కోసం విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత నాలుగు రోజులుగా లబ్ధిదారుల పేర్లను నమోదు చేస్తున్నామని ఏజేమిల్స్ సబ్‌స్టేషన్ ఏఈ జ్యోతిర్మయినాథ్ తెలిపారు. వరంగల్ ఏజేమిల్ సబ్‌స్టేషన్ పరిధిలో కాశిబుగ్గ శివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు 900ల మందికి పైగా లబ్ధిదారుల పేర్లను నమోదు చేసినట్లు వివరించారు. సబ్ స్టేషన్ పరిధిలో 20,250 గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, ఈక్రమంలో బృందాలను ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. సొసైటీ కాలనీ, ఓసిటీ, శివాలయం, ఓని భాస్కర్ ఇంటి సమీపంలో ఆదివారం నమోదు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు రశీదుతో వచ్చి నమోదు చేయించుకోవాలని కోరారు.

సంఘ వ్యతిరేక శక్తులతో జాగ్రత్త

నయీంనగర్: సంఘ వ్యతిరేక శక్తుల నుంచి జాతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అధ్యాపకుడు చంద్రమౌళి అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్తీ వ్యాపారం, లంచగొండితనం, రౌడీయిజం, గూండాయిజం, ఉగ్రవాదం వంటి వాటిని ప్రజలు ఉపేక్షించవద్దని సూచించారు.

సంక్షిప్తంగా

పంటలకు మద్దతు ధర కల్పించాలి

వరంగల్: దేశవ్యాప్తంగా రైతులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం, రైతుల ఉద్యమాల నేపథ్యంలో పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తూ చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీడీపీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడు అర్షనపల్లి విద్యాసాగర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామినాథన్ సూత్రాలను పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరలను అమలు చేసేందుకు రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఫార్మసీతో ఉజ్వల భవిష్యత్

కేయూ క్యాంపస్: ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య అన్నారు. వరంగల్ ములుగురోడ్డులోని సహస్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో శనివారం ట్రెడిషనల్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో విద్యార్థులు ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ రమేష్, ప్రిన్సిపాల్ గన్ను ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ ధీరజ్, డాక్టర్ కీర్తి, విభాగం అధిపతి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండలో జరిగింది. మడికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన తోట శంకరయ్య (70) భార్య తోట లక్ష్మి మృతి మూడేళ్ల క్రితం చెందింది. అప్పటి నుంచి ఆయన మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. దాంతో ఇంటిలో నుంచి బయటకు వెళ్లి రెండు, మూడురోజులకు తిరిగి ఇంటికి వచ్చే వాడు. ఈనెల 15వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిన శంకరయ్య తిరిగి ఇంటికి వెళ్లలేదు. మడికొండ శివారులోని హిల్స్ కాలనీలోని చెట్టు కిందపడి ఉండగా స్థానికులు గమనించి 108అంబులెన్స్ ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శంకరయ్య శనివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పూలమొక్కలు అందజేశారు. సీపీని కలిసిన వారిలో పరకాల ఇన్‌స్పెక్టర్ రవిరాజా, కాకతీయ యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ చేరాలు ఉన్నారు.

సీపీని కలిసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్ సీపీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్ రావు, లేబర్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు నాగభూషణం, ప్రవీణ్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, కొత్తపల్లి ప్రసాద్‌రావు, బొద్దిరెడ్డి సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీతారాం నాయక్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలి

హన్మకొండ: మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్‌కు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని విద్యుత్ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు వాలు నాయక్, కార్యదర్శి అజ్మీర శ్రీరాం నాయక్ కోరారు. బంజారా జాతికి గర్వకారణంగా నిలుస్తున్న అజ్మీరా సీతారాం నాయక్‌కు ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

మామునూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు ఇంగ్లిష్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకుంటే ఉజ్వలమైన భవిష్యత్ సొంతమవుతుందని హెడ్ ఆఫ్ ఆపరేషనల్ ఎక్స్‌లెన్సీ యూనివర్సిటీ రెలేషన్స్ బ్రిల్యో న్యూజెర్సీ (యూఎస్ఏ) రీతూశర్మ, వాగ్దేవి కళాశాల చైర్మన్ సీహెచ్ నరసింహారెడ్డి, కార్యదర్శి చందుపట్ల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల స్నాతకోత్సవం (గ్రాడ్యుయేషన్) -24 డే వేడుకలను శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగాలు రాని అధైర్యపడకుండా అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎన్ శర్మ, డెరెక్టర్ డాక్టర్ వాణిదేవి, వాహినిదేవీ, ప్రసాద్‌రావు, శశిధర్, సంతోష్, సలీం, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్



భీమారంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్



వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో..



పోచమ్మమైదాన్ జంక్షన్‌లో..



మడికొండ చౌరస్తాలో..



కాజీపేట చౌరస్తాలో..

మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను నగరవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులు కట్‌చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కేసీఆర్ పోరాటం ద్వారానే రాష్ట్రం సిద్ధించిందని గుర్తుచేశారు.

- సాక్షి నెట్‌వర్క్

నేటినుంచి వరంగల్ - మేడారానికి ప్రత్యేక బస్సులు



వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో మేడారం వెళ్లే భక్తుల కోసం ఏర్పాటు చేసిన వసతులు

వరంగల్ చౌరస్తా: మేడారం జాతరకు వరంగల్ నుంచి ఆదివారం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరంసింగ్ తెలిపారు. వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న తాత్కాలిక న్యూ బస్‌షెల్టర్ నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వివరించారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నదీ జలాల పంపిణీలో అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

కాజీపేట: నదీ జలాల వాటాల పంపిణీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టింపులేనితనం వల్లే రాష్ట్రానికి దక్కాల్సిన వాటా రాకుండాపోయిందని టీటీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గట్టు ప్రసాద్‌బాబు విమర్శించారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వప్రయోజనాల కోసమే ప్రాజెక్టులను బీఆర్ఎస్ ఫణంగా పెట్టిందని అన్నారు. ఈనెల 26, 27వ తేదీల్లో కృష్ణా నదీ జలాల వాదనల్లో అధికార పార్టీకి బీఆర్ఎస్ సహకరించాలని సూచించారు. సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడ మరియ, కాగితాల జయశంకర్, పిట్టల శ్రీనివాస్, బైరపాక ప్రభాకర్, ఎలుగు వెంకటేశ్వర్లు, పోతరాజు అనిల్ కుమార్, రవీందర్ గుప్తా, వీరాంజనేయులు పాల్గొన్నారు.

తల్లుల జీవితం, పోరాటం స్ఫూర్తిదాయకం



హన్మకొండ: వన దేవతలు సమ్మక్క, సారలమ్మ జీవితం, వారి పోరాటం స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మను కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కుమార్తె కృషిక భాస్కర్, కుమారుడు కృష్ణవ్ భాస్కర్‌ల ఎత్తు బంగారాన్ని సమర్పించారు.

ట్రెజరీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లా టేబుల్, వాల్ క్యాలెండర్లను హనుమకొండ ట్రెజరీ కార్యాలయంలో ట్రెజరీ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం రాత్రి ఆవిష్కరించారు. డీడీ గుజ్జు రాజు, ములుగు డీటీఓ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేసి సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సీహెచ్.వెంకన్న, కార్యదర్శి టి.వినయ్ కుమార్, సంఘం సభ్యులు విజయకుమారి, రాజేశ్వరి, నాగమణి, సంతోష్ కుమార్, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఈశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: కేవీపీఎస్ డైరీ, క్యాలెండర్లను హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్, జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, దూడపాక రాజేందర్, జేమ్స్ రాజ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)